రమాయణం

**మా నాన్నా, అమ్మా ఇద్దరికీ ఉర్దూ వచ్చు. అసలు వాళ్లు చదివిందే ఉర్దూ మీడియంలో. నిజాం పరిపాలనలో చాలా ఏళ్లు ఉన్నందున.. తెలంగాణలో ఎక్కువమందికి ఉర్దూ మిళితమైన హిందీ కొంచెంగానైనా వచ్చేది. రెవెన్యూ తదితర ప్రభుత్వ ఆఫీసుల్లో ఎక్కువమంది హిందీ, ఉర్దూ కలగలిపి మాట్లాడేవారు.**

# వామ్మో.. హిందీ!

మేము పెరిగింది పల్లెటూళ్లో! పైగా అరవై లలో పుట్టినవాళ్లం గనుక.. మాకు నిత్య జీవితంలో హిందీలో గానీ, ఇంగ్లిష్‌లో గానీ మాట్లాడే అవకాశం లేదు. అయితే ఇంగ్లిష్ ప్రాబల్యం పెరుగుతూ ఉంది కనుక, మంచి ఇంగ్లిష్ టీచర్ల వల్ల కూడా మాకు ఇంగ్లిష్‌లో మార్కులు బాగానే వచ్చేవి. హిందీ కోసమైతే.. పడరాని పాట్లు పడేవాళ్లం. అదేమిటో గానీ హిందీ సార్లు కూడా పాఠం చదివి ఒక్కో లైన్‌నూ తెలుగులోకి అనువదించి చెప్పేవారు తప్ప.. హిందీని ఒక భాషగా ఎలా నేర్చుకోవాలో చెప్పిన జ్ఞాపకం లేదు. 'కా' ఎక్కడ అనాలి? 'కీ' ఎక్కడ ప్రయోగించాలి?.. అలా తేడా ఎందుకు అనే చిన్న విషయాలు కూడా మాకు తెలిసేవి కావు. నాకు హిందీలో కూడా ఫస్ట్‌క్లాస్ మార్కులే వచ్చేవి గానీ, బట్టీ కొట్టి చదివి రాసినవే తప్ప.. మిగతా సబ్జెక్ట్‌లా బాగా అర్థం చేసుకుని రాసినవి కావు.

ఎందుకో తెలియదు.. హిందీలో కూడా కవిత్వ విభాగమే బాగా గుర్తుండిపోయింది. సుభద్రా కుమారీ చౌహాన్ రచించిన 'బార్ బార్ ఆతీ హై ముజ్‌కో మధుర్ యాద్ బచ్‌పన్ మేరీ'.. పద్యమంతా నోటికి వచ్చేది. కబీర్ కే దోఁహే, తులసీ కే దోఁహే చదివేవాళ్లం. 'మాలాతో కర్ మేఁ ఫిరై జీబ్ ఫిరై ముఁహ మాహీ, మన్వాతో చహు దిశే ఫిరై.. యహ్‌తో సుమిరన్ నాహి' ఇలాంటివి అర్థాలతోసహా మనసు పొరల్లో గుర్తుండిపోయాయి. మా సార్లు కూడా పదేపదే.. ''అరేయ్! హిందీల ఫేల్ కాకుండిరా! ఇజ్జత్ పోతది. తతిమ్మ పేపర్ల లెక్క ముప్పై అయిదు మార్కులొచ్చుడు అక్కర్లే! ఇరువై ఎనిమిదొస్తె చాలు. ఎట్లనన్నజేసి బట్టీ కొట్టి అన్న.. చిట్టీ జూసన్న రాయిుండి'' అని చెప్పేవారే తప్ప.. పాపం హిందీకి ఎందుకంత మినహాయింపో చెప్పేవారు కాదు.

అక్కకు హిందీ అంటే చాలా గండంగా ఉండేది. హిందీ పరీక్ష రేపనగా టెక్స్ట్ బుక్కు, నోట్ బుక్కు పట్టుకుని.. రోజంతా చదువుతూనే ఉండేది. మంచి మార్కులే వచ్చేవి గానీ.. మాట్లాడటం అస్సలు వచ్చేది కాదు. అక్క వరంగల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు తన ఫ్రెండ్ సరోజ వాళ్లు కాజీపేటలోని రైల్వే క్వార్టర్స్‌లో ఉండేవారు. ఆమె తమ్ముడు రాజు. తన ఫ్రెండ్స్ లిస్ట్‌లో జయ, సుజాత, బారు సీనుతోబాటు నార్త్ ఇండియన్స్.. ప్రేమ్ లాల్ సత్సంగి, రవి ఉండేవారు. సత్సంగి, రవి హిందీ పాటలు బాగా పాడేవారు. ఆ పదహారేళ్ల వయసులో మా అక్క సన్నగా, పొడవుగా, నాజూగ్గా భలే బావుండేది. సత్సంగి.. అమోల్ పాలేకర్‌లా ఉండటమే కాదు, చిత్ చోర్ సినిమాలో 'గోరీ తేరా గావ్ బడా ప్యారా' లాంటి పాటలు అద్భుతంగా పాడేవాడు.

సరోజ వాళ్లింటికి అక్క వెళ్లినప్పుడల్లా.. ఈ గ్యాంగ్ అంతా అక్కడే ఉండి, పాటలు పాడుకుంటూ ఉండేవారు. సత్సంగి ఎప్పుడూ మా అక్కతో ఏదో మాట్లాడాలని ప్రయత్నించేవాడట. అక్క మాత్రం హిందీ రాకపోవడం వల్ల.. ఇంటి పైకప్పుకేసీ, గోడల వైపూ, నేలకేసీ చూస్తూ ఉండేదట. మరీ బావుండదని ఎప్పుడైనా ఓసారి నవ్వేదట. ఓ సెలవు రోజున నేను, అక్కా కలిసి కాజీపేటలోని సరోజక్క వాళ్లింటికి వెళ్లాం. అక్కడ సత్సంగి, రవి కొన్ని పాటలు పాడారు. వాళ్లు జయ, సుజాతవాళ్లతో చాలా చనువుగా ఉండటం నన్ను ఎంతో ఆశ్చర్యపరిచింది. సత్సంగి నన్ను కుశల ప్రశ్నలు వేశాక.. ''ఆప్‌కీ బడీ బెహన్ కుచ్ బాత్ నహీ కర్తీ క్యోం?'' అని అడిగాడు. నేను మాత్రం అప్పటికి ఏమైనా హిందీ పండిట్‌నా?! ''మేరీ బెహన్‌కో హిందీమే బాత్ కర్ నా నహీ ఆతీ హై!'' అంటూ.. పుస్తక భాషలో ప్రశ్నకు జవాబు రాసినట్టు చెప్పాను. ఆయన బాగా నవ్వాడు.

హైదరాబాద్‌లో మా కజిన్స్ హైమక్క, లక్ష్మి వాళ్లు కొన్నేళ్లపాటు ఓల్డ్ సిటీలోని బేలా చౌరస్తాలో వాళ్ల తాతయ్యకు చెందిన పెద్ద దేవిడీలో ఉన్నారు. ఆ ఇల్లు చాలా పెద్దది. పైగా సర్వెంట్ క్వార్టర్స్, లాన్, ఫౌంటెయిన్, రూఫ్ గార్డెన్ కూడా ఉండేవి. డా.వాఘ్లే అనే ప్రసిద్ధ వైద్యుడు ఆ ఇంట్లో చాలా రోజులు కిరాయికి ఉండటం వల్ల.. దాన్ని వాఘ్లే డాక్టర్ ఇల్లు అనేవారు. కిందిభాగం అంతా వీళ్లుంటే.. పై అంతస్తుల్లో రెండు, మూడు మార్వాడీ కుటుంబాలు అద్దెకు ఉండేవి.

అందులో సుశీల్ టైర్స్ షాప్ ఆయన కొడుకు రాజేష్.. మా కంటే చిన్నవాడు, అస్తమానూ మా దగ్గరికి వచ్చి లొడలొడా మాట్లాడుతూ ఉండేవాడు. ఓసారి మా లక్ష్మి.. ''ఈ పోరడు ఎప్పుడు సోది మాట్లాడుతనే ఉంటడు. వీనికి నోరెందుకు నొవ్వదో ఏమో!'' అన్నది. ఆ పిల్లవాడు ఏమీ అనలేదు. అప్పట్నుంచీ మేము ఆడపిల్లల కబుర్లు ఏం మాట్లాడుకోవాలన్నా తెలుగులోనే మాట్లాడుకునే వాళ్లం. ఓసారి ఏదో మాట్లాడుతూ మా అక్క.. ''ఈ పోరనికి అర్థం అయితదో ఏమో!'' అన్నది. రాజేష్ వెంటనే.. ''ఏయ్ అక్కా! నన్ను పోరడు అంటవ్?!'' అని అలిగాడు. అతను ఈ మధ్యలో మాతో మాట్లాడుతూనే తెలుగు నేర్చుకున్నాడన్న మాట. ఏ భాష అయినా తెలియకపోతే ఎంత ఇబ్బంది కదా!? అనిపించింది.

మరోసారి లక్ష్మి మా అక్కను తీసుకుని పై పోర్షన్‌లో ఉన్న రాజేష్ వాళ్లింటికి వెళ్లింది. ఏదో మాట్లాడుతుంటే మధ్యలో లక్ష్మిని కింద నుంచి ఎవరో పిలిస్తే.. ''కూర్చో అక్కా, ఇప్పుడే ఒస్తా!'' అని అక్కను అక్కడే కూర్చోబెట్టి వెళ్లిందట. రాజేష్ వాళ్లమ్మ అక్కతో ఏదో మాట్లాడుతూనే ఉన్నదట. అక్క ఆ మాటల్లో కల్పించుకోకుండా.. 'లక్ష్మి ఎప్పుడొస్తుందా!?' అని దిక్కులు చూస్తూ కూర్చున్నదట. ఆవిడ చివరికి ''సంధ్యా! మేరే బాత్ తుమ్‌కో పసంద్ నై ఆరే క్యా?!'' అనడిగితే.. అక్క వెంటనే ''హాఁ హాఁ'' అన్నదట. దానికి ఆవిడ చాలా బాధపడి నిశ్శబ్దంగా కూర్చున్నదట. తరువాత లక్ష్మి విషయం తెలుసుకొని.. ''ఐసా నై భాబీ! ఉస్‌కో హిందీ నై ఆతా!'' అని ఆమెకు సర్దిచెప్పి, కిందికి వచ్చాక ఒకటే నవ్వడం మొదలుపెట్టిందట.

ఇంకోసారి సెలవుల్లో హైదరాబాద్‌కు వెళ్లినప్పుడు.. ఓ రోజు హైమక్క, మా అక్క, లక్ష్మి, నేనూ రెండు రిక్షాల్లో సినిమాకు వెళ్లాం. తిరిగి ఇంటికి వచ్చాక మా అక్క తనే రిక్షా కిరాయి ఇద్దామని అనడంతో హైమక్క లోపలికి వెళ్లిందట. ''ఎంతయ్యా?!'' అన్నదట అక్క. అతను ''దేడ్ రూపాయి'' అన్నాడట. ''ఎందుకైతది?! అడే రూపాయ్ మాట్లాడినం కదనయ్యా?!'' అని అక్కా.. ''కాదు, దేడ్ రూపాయే!'' అని అతనూ కాసేపు అనుకున్నాక.. చివరికి అక్క రూపాయిన్నర ఇచ్చిందట. ''అరె, అప్పటి నుంచి నేను గిదే అన్నగద నమ్మ!'' అని అతను వెళ్లిపోతుండగా.. మేమున్న రిక్షా కూడా వచ్చింది. విషయం తెలిసి ఇంట్లోకెళ్లి పడీపడీ అందరం నవ్వుతుంటే.. చేసేదేమీ లేక అక్క కూడా నవ్వింది. అదీ హిందీ అంటే!! ■




**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**


